


మధ్య టేబిల్ ఉంది. టేబిల్ చుట్టూ రక రకాల ఆసనాలు ఉన్నాయి. ఒకవైపు పేము కుర్చీ, రెండవ వైపు ఓ కర్రకుర్చీ, మూడవ వైపు ముక్కాలిపీట, నాల్గవ వైపు రెండు ట్రంకు పెట్టెలు ఒక దానిపైన ఒకటి పేర్చి ఉన్నాయి. ఈ నాలుగు ఆసనాలకీ మధ్యమధ్య నాలుగు "మోడాలు" కూడా చోటు చేసుకున్నాయి. నీరద స్నేహితులు అప్పటిదాకా నాలుగు పేకలతో "అడ్డాట" ఆడి అప్పుడే వెళ్ళిపోయారు. టేబిల్ మీద పేకముక్కలు చిందరవందరగా పడి ఉన్నాయి. ఆలస్యంగా వచ్చిన బదరీనాథ్ నాలుగు పేకల్లోంచి ఓ పేక విడదీసి ఒక్కడూ 'పేషన్స్' ఆడుతున్నాడు. అతను కదిలినప్పుడల్లా అతను కూర్చున్న ట్రంకుపెట్టె మూతలు చప్పుడు చేస్తున్నాయి.

●

ఆవేళ ఆఫీసుకు వెళ్ళగానే నీరదకి పెర్మనెంట్ అయినట్టు ఆర్డరు వచ్చింది. అందుకని తన స్నేహితుల్ని సాయింకాలం "టీ"కి రమ్మని పిలిచింది. తన ఆఫీసులోనే పనిచేసే కనకం తనూ కలిసే ఉంటున్నారు. కనకం అప్పుడే ట్రెయిన్‌కి వెళ్ళింది ఓ వారం రోజులు సెలవ మీద.

మంచంమీద కూర్చున్న నీరద లేచి, బదరీ పక్కన ఉన్న ఖాళీ ప్లేట్, కప్, సాసర్ లోపల పెట్టి వచ్చి కిటికీ దగ్గరకు వెళ్ళి ఊచలుపట్టుకొని బయటకు చూస్తూ నిలబడింది. అప్పుడే ఆరంభం అయిన వానచినుకులు ఆమె ముఖంమీదపడి ముత్యాలలా మెరుస్తున్నాయి. నీరద చాలా ఆనందంలో ఉంది. తన జీవితంలో ఒక ముఖ్య సమస్యకు పరిష్కారం దొరికింది. తన కాళ్ళమీద తను నిలబడవచ్చు. తన జీవితం తన యిష్టం వచ్చినట్లు నడుపుకోవచ్చు. తన వెనక ట్రంక్‌పెట్టె మూతలు మళ్ళా చప్పుడయాయి. ఆలోచనలకి అంతరాయం వచ్చి, వెనక్కితిరిగి బదరీ కూర్చున్న చోటికి వచ్చింది. బదరీ తదేక ధ్యానంతో పేషన్స్ ఆడుతున్నాడు.

"ఏదో ఆలోచనలో ఉన్నట్టున్నారు, ఇస్పేట్ రాజు క్రింద, ఇస్పేట్ మదాం పెడుతున్నారు" అంది నీరద. బదరీ ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు. ట్రంక్‌పెట్టె మూతలు మళ్ళా చప్పుడు చేశాయి.

"మీకు పుణ్యం ఉంటుంది- అల్లా పేము కుర్చీలో కూచుందురూ!"

"ఆ కుర్చీలో కూర్చునే అర్హత నాకు లేదు" అన్నాడు బదరీ, ఇస్పేట్ రాజు క్రింద డైమన్ మహాం పెడుతూ.

"ఎందుచేతనో" అంది నీరద.

"మీకు 'మ్యూజికల్ ఛెయిర్స్' ఆట తెలుసు కదా! చిన్నప్పుడు బళ్ళో ఆడే ఉంటారు. బ్యాండ్ వాయిస్తున్నంతసేపూ కుర్చీలచుట్టూ తిరుగుతూ బ్యాండ్ ఆపి వేయగానే ఏదో కుర్చీలో కూచోవాలి. కుర్చీ దొరకని వాళ్ళు ఔట్ అయినట్టే." అన్నాడు పేకముక్కలు ఒకదాని క్రింద ఒకటి పెడుతూ.

"ఉపోద్ఘాతం అయితే, ఇంక విషయం లోకి రండి" అంది నీరద నవ్వుతూ.

"ప్రస్తుతం ఇక్కడ మ్యూజికల్ ఛెయిర్స్‌లో, మిగిలి ఉన్న ఒక కుర్చీ చుట్టూ నలుగురు తిరుగుతున్నారు."

"అందులో మీరు లేరు కదా!" అంది కొంటెగా చూస్తూ.

"మీకా భయం అక్కరలేదు. నా 'మ్యూజికల్ ఛెయిర్స్' ఆట అయి పోయింది. నేనూ ఒక కుర్చీని సంపాదించు కున్నాను."

"అయితే స్వయంవరం నడిపించిన ఆ రమణీమణి ఎవరండీ?"

"ఇప్పుడు మెడిసిన్ ఆఖరి సంవత్స రంలో ఉంది. పరీక్షలయిపోగానే పెళ్ళి చేసుకుందాం అనుకున్నాం" అన్నాడు బదరీ.

"ఓహో! అల్లాగా" అంది. ఆమె గొంతులో ఏదో అస్పష్టమైన అసంతృప్తి ధ్వనించింది. కాని వెంటనే తన మామూలు ధోరణిలో నవ్వుతూ "అయితే ఇక్కడ 'మ్యూజికల్ ఛెయిర్స్' ఆట ఆడే ఆ నలు గురూ ఎవరో సెలవిస్తారా?" అంది.

బదరీ ఒక్కక్షణం ఆమెకేసి చూశాడు. అతని మనస్సులో ఏదో మెరిసింది. పేక లోంచి ఒక్కొక్క ముక్క బల్లమీద తిరి గేస్తూ, "ఇది డైమండ్ జాకీ, ఇది ఇస్పేట్ జాకీ, ఇది అరకు జాకీ, ఇది కళావరు జాకీ- ఈ నాలుగు జాకీలూ చూశారూ! ఈ హార్ట్స్ క్వీన్ చుట్టూ తిరుగుతున్నాయి."

"ఇంతకీ హార్ట్స్‌క్వీన్ ఎవరండోయ్?"

"ఆ మాట కూడా నా నోటితో చెప్పిం చాలనా! సరే కానివ్వండి. మీకు తప్ప ఆ కీర్తి ఎవరికుంది చెప్పండి! ఇంక ఈ నాలుగు జాకీలూ ఎవరంటారేమో! మీరు అడక్కుండానే చెప్పేస్తాను.

"డైమండ్ జాకీ అంటే దామోదర రావు, నలుగురిలో చిన్నవాడు. అందరినీ ఇమిటేట్ చేసి నవ్విస్తుంటాడు. గిటార్ వాయిస్తూ పాటలు పాడుతుంటాడు. రెండు, కళావర్ జాకీ- అంటే కామేశ్వరరావు. లోకపరిజ్ఞానం ఎక్కువ. ఈ ఊళ్లో ఏ సరు కులు ఎక్కడ దొరుకుతాయో, ఏ నంబర్ బస్ ఎక్కడకి వెడుతుందో, క్యూలోనుంచో నక్కరలేకండా సినిమా టికెట్టు సంపా

దించడం ఎల్లాగో, ఇంకా రైల్వే స్లీపర్లు సంపాదించడం - ఇల్లాంటి పనికొచ్చే విషయాలన్నిటిలోనూ - పరిజ్ఞానం సంపాదించి బ్రతకడం నేర్చినవాడు. ఇంక మూడు, అరకు జాకీ అంటే ఆనందరావు. మంచి బట్టలు వేస్తాడు. రచయిత, కవి. బ్రహ్మపదార్థం మొదలుకొని బజారు ధరలదాకా అన్ని విషయాలమీదా పద్యాలు వ్రాశాడు. ప్రణాళికా సాహిత్యంలో అందెవేసిన చెయ్యి. ఇంక మిగిలిపోయింది 'స్పేడ్' జాకీ, అంటే శ్యామసుందర్. పేరులో ఉన్నంత అందం మనిషిలో లేకపోయినా, తెలివితేటలతో వచ్చిన ఆకర్షణ ఏదో ఉంది. నిదానమైన మనిషి, సెలవలు ఉన్న కాలేజీ లెక్చరర్ ఉద్యోగం, ఊరికి దూరంగా కాలేజీ, కాలేజీ వాళ్ళిచ్చిన క్వార్టర్స్...."

బల్లమీద నాలుగు జాకీలని అటూ ఇటూ తిప్పుతూ, చెప్పుకుపోతున్నాడు బదరీ. నీరద కళ్ళలో ఆరంభించిన నవ్వు పెదవుల దాకా జారి, పెళ్ళున నవ్వడంతో ఆఖరయింది. బలవంతాన నవ్వు ఆపుకుంటూ, "మీరు పెళ్ళిళ్ళ పేరయ్యలా బాగా పనికి వస్తారు సుమండీ!" అంటూ తిరిగి నవ్వడం ఆరంభించింది.

"మీతో ఇదివరకు ఎప్పుడైనా చెప్పేనో లేదో, అల్లా నవ్వుతుంటే మీరు ఎంతో బాగుంటారు."

"ఓహో! అల్లాగా!" అంది నీరద.

"అవును, మనిషి అన్నీ మరచిపోయి అల్లా నవ్వ గలగాలి, వ్యక్తులు జీవితాంతం వరకు అల్లా నవ్వగలిగే శక్తి మిగుల్చుకుంటే చాలా అదృష్టవంతులు."

నీరద అటూ ఇటూ పచారుచేస్తూ ఆలోచనలో పడింది. స్నేహితులు ఒక్కొక్కళ్ళే మనసులో తిరుగుతున్నారు. దామోదర్, కామేశ్వరరావు, ఆనందరావు, బదరీ- వీళ్ళంతా తను పనిచేసే ఆఫీసులోనే పని చేస్తారు. బదరీ ద్వారానే శ్యామసుందర్ పరిచయం అయింది. ఏడాదిక్రితం సంగతులన్నీ జ్ఞాపకానికి వచ్చాయి. ఈ ఉద్యోగానికి వెళ్ళవద్దనీ, పెళ్ళిచేసుకోమనీ- ఇంట్లో పెద్దగోల. తనవాళ్ళు- ఆ మురికి వీధి, ఇరుకుకొంప, అవన్నీ జ్ఞాపకం వచ్చినప్పుడు ఉక్కిరి బిక్కిరి అయిపోతుంది. పెళ్ళంటే ఏవగింపు పుట్టింది. ఉద్యోగధర్మమా అని ఈ ఊరు వచ్చిపడ్డాక కాస్త స్వేచ్ఛగా గాలి పీల్చుకుంటోంది. కాని ఇక్కడకూడా బదరీనాథ్ వీలైనప్పుడల్లా తన పెళ్ళి ప్రస్తావన తెస్తుంటాడు. అతను చెప్పేది నవ్వేసి తోసెయ్యడానికి ప్రయత్నించేది, కాని అతని మాటలు కొన్ని ఒంటరిగా ఉన్నప్పుడు తనని వెంటాడుతూ, ఏదో అశాంతిని రేపేవి. బదరీ ఆ "పేషన్స్" ఆట ఆపేసి; ఆ ముక్కలతో పేకమేడ కట్టడం ఆరంభించాడు.

"ఏమండీ బదరీనాథ్ గారూ! మీకు ఈ నాలుగు జాకీలు ఒకటేనా లేక ప్రత్యేక అభిమానా లున్నాయా?" అంది నీరద.

"నా అభిప్రాయాలవల్ల మీమీద ఒత్తిడి తీసుకురావడం నా మతంకాదు, ముఖ్యంగా పెళ్ళిలాంటి స్వంత విషయాల్లో, ఈ నలుగురికీ మీరంటే యిష్టం, నలుగురి మనస్తత్వాలు వేరువేరుగా ఉండచ్చు. 'నీ కోసం నిప్పుల్లో దూకుతాను, నీ కోసం భూమి అంచులదాకా నడుస్తాను' అని వాస్తవానికి దూరంగా మాట్లాడేవాళ్ళుండచ్చు. 'నీవు నా జీవిత నౌకకి చుక్కానివి, నీవులేని జీవితం పెను ఎడారి' అంటూ ఊహల్లో విహరించే వాళ్ళు ఉండచ్చు. ఇంక తన మనస్తత్వంతో సరిపోయే, మీలో ఉత్సాహం, చురుకుదనం, ఈ లక్షణాలు గుర్తించి, మీరు చేయి ఊతగా ఇస్తే, జీవితం సుఖమయం చేసుకునే అవకాశం ఎంతైనా ఉందని లోలోపలే అనుకునే వాళ్ళుండచ్చు."

"అబ్బా నాలో ఉత్సాహాన్నీ, చురుకుతనాన్నీ గుర్తించినవా రెవరండోయ్!" అంది నీరద అమాయకంగా ముఖం పెడుతూ.

"శ్యామసుందర్‌కి మీరంటే చాలా గౌరవం" అన్నాడు బదరీ ఆమె ముఖంలోకి చూస్తూ.

"ఏమోలెండి, దామోదర్‌కి నేనంటే ఎంతో యిష్టం, ఎప్పుడూ నవ్విస్తూంటాడు. అతనితో కూచుంటే గంటలు నిమిషాలలాగ దొర్లిపోతాయి" అంది నీరద వేరే వేపు చూస్తూ.


పేక ముక్కలతో మేడ కడుతున్న బదరీ ఒక్కసారి ఆగి "దామోదర్‌కి ఇప్పుడు 22 ఏండ్లు. మీ వయస్సెంతో నాతో చెప్పనక్కరలేదు గాని, బహుశా అతని పరిచయంలోకి వచ్చిన మొదటి స్త్రీ మీరే అయి ఉండచ్చు. ఇప్పుడతను మీ కోసం నిప్పుల్లో దూకచ్చు, ఏదైనా చెయ్యొచ్చు. ఇంకో నాలుగేళ్ళు పోయిన తర్వాత అతను పెరిగినప్పుడు అప్పుడు పరిస్థితి ఎల్లా ఉంటుందో చెప్పడం కష్టం. పైగా భార్యాభర్తల వయస్సులో భర్తవయస్సు చిన్నదయితే, ఆ దాంపత్యం ఇల్లాగే ఉంటుంది" అంటూ తను కడుతున్న పేకమేడకేసి చూపించాడు.

అతని కేసి గుర్రుగా చూస్తూ నీరద, "అయితే దాంపత్యం సుఖంగా ఉండడానికి భార్యాభర్తల వయస్సు ఒక్కటేనా కారణం?" అంది విసురుగా.

"అదికూడా అనుకూల దాంపత్యానికి ఓ కారణమేమోనని నా అనుమానం" అంటూ పేకముక్కల్ని బొత్తిగా పెట్టి లేచాడు, ఇంటికి వెళ్ళే ప్రయత్నంలో. తనని అల్లాగే రెచ్చగొట్టి మధ్యలో వెళ్ళిపోతుండడం ఇతనికి అలవాటైపోయింది. ఇవ్వాళ అల్లా వెళ్ళనియ్యకూడదు. సంగతి ఏమిటో తేల్చుకోవాలి అనుకుంది నీరద.

"ఇంటికి వెళ్ళడానికి ఇంకా చాలా టైమ్ ఉంది లెండి, కాస్సేపు కూర్చోవచ్చు. మీరు ఏమీ అనుకోకపోతే మిమ్మల్ని ఓ ప్రశ్న అడగవచ్చునా?"

"తప్పకుండా అడగండి" అన్నాడు బదరీ కూర్చుంటూ.




"నా పెళ్ళి విషయంలో మీకింత ఆదుర్దా ఎందుకండీ?" అంది కొంచెం దూకుడుగా

ఒక్కక్షణం బదరీ ఏమీ చెప్పలేదు ఆమె మాటల్లోని మరుకుతనం అతనికి తగిలినా, అతను నవ్వుతూనే సమాధానం చెప్పాడు

"నిజమే,మీ పెళ్ళి మీ స్వంత విషయం కాని నాకు ఓ కద జ్ఞాపకం వస్తుంటుంది ఓ నలభై యేళ్ళ పెళ్ళికాని యువతీ, ఓ పాతికేళ్ళ యువకుడూ వెన్నెల్లో షికారు తిరుగుతున్నారట. ఆవిడ అతనితో గారంగా, 'నేనంటే ఎవరికీ ప్రేమలేదు' అందిట 'అదేమిటండీ మీ అమ్మగారికి మీమీద తప్పకుండా ఉంటుంది ప్రేమ' అన్నాట్ట అతను రెండో ప్రయత్నంగా ఆవిడ 'ఈ వెన్నెల్లో చలికి నా వేళ్ళు కొంకరలు పోతున్నాయి' అందిట. 'కాస్సేపు వాటిమీద కూర్చోండి అవే సర్దుకుంటాయి' అన్నాట్ట.

నీరదకి ఒళ్లు మండిపోయింది "మొదటి విషయం, నా వయస్సు నలభై ఏళ్లు కాదు! పెళ్ళికోసం అంత తహతహ లాడిపోయే స్థితిలోనూ లేను" అంది

"అది కథలోని విషయం ఆ కథ జ్ఞాపకం వచ్చినప్పుడల్లా, ఎవరైనా అటువంటి వృద్ధబ్రహ్మచారిణి అయిపోతే జీవితం ఎంత దుర్భరంగా ఉంటుందో అనిపిస్తుంది ఇంతకీ నా కిష్టమైన వ్యక్తుల శ్రేయస్సు దృష్ట్యా సలహా ఇవ్వడం నా విధి అనుకున్నాను" అన్నాడు బదరీ, తన ధర్మం ఏదో నెరవేరుస్తున్న వాడిలా.

నీరద కొంతకోపం దిగమింగుకుంది. "నా మీద అల్లాంటి అభిమానం ఉన్నందుకు చాలా కృతజ్ఞురాల్ని. ఇంతకీ నేను ఎవరిని పెళ్ళిచేసుకోవాలనీ, మీ సలహా?" అంది వెటకారంగా.

బదరీ మామూలుగానే చెప్పడం ఆరంభించాడు. "పెళ్ళి లాటరీ లాంటిది. పెళ్ళయిన వాళ్ళందరినీ మీరు సుఖంగా ఉన్నారా, మీరు సుఖంగా ఉన్నారా అని ప్రశ్నించుకుంటూపోతే రకరకాల జవాబులు రావచ్చు. ఇదివరకుదాకా పెళ్ళిళ్లు పెద్దవాళ్ళే ఏర్పాటుచేసేవారు గనక, ఎటుపోయి ఎటొచ్చినా ఆ పెద్దవాళ్ళని తిట్టే అవకాశం ఉండేది. ఇప్పుడు ఆ అవకాశం కాస్తా జారవిడుచుకున్నాం. ఇంక బాధ్యత మనదే. మీకు ఈ నలుగురి గురించీ రెండేళ్లుగా తెలుసు. వాళ్ళ నలుగురికీ మీరంటే యిష్టం. అందులో ఎవరూ అని మీరు తేల్చుకుంటే ఇబ్బందే లేదు. ఒకవేళ తేల్చుకోలేకపోతే నేనో సలహా ఇస్తాను, వీలైతే ఆలోచించండి. ఈ నలుగురిలోనూ లాటరీ వెయ్యండి. ఈ పేకలో నాలుగు జాకీలు ఉన్నాయి కదా! అందులో ఏ జాకీ ఎవరో ఇందాకా చెప్పనే చెప్పాను. మీ ప్రశ్న ఈ పేకకే వెయ్యండి. పేక బాగా కలిపి ఒక్కొక్క ముక్కే తిరగెయ్యండి. మొదట వచ్చిన జాకీకి సలాం పెట్టండి." అన్నాడు.

నీరద ఉక్కిరి బిక్కిరి అయింది. తన పెళ్ళంటే ఇంత వేళాకోళంగా ఉందా ఇతనికి! తన పెళ్ళి జూదం లాంటిదా! ఆమె తేరుకుని సమాధానం చెప్పేలోగా బదరీ వీధిలో ఉన్నాడు. కోపంతో ముఖం ఎర్రబడిపోయింది. అతను కూర్చున్న ట్రంకు పెట్టెల్ని ఓ తాపు తన్నింది. తను ఎంతో సంతోషంగా గడపాలనుకున్న ఈ రోజు కాస్తా పాడుజేసి పోయాడు. ఆ రాత్రి నీరదకి సరిగా నిద్ర పట్టలేదు. బదరీ చెప్పిన కథ, అతని మాటలు బుర్రలో తిరగడం ఆరభించాయి. అప్పుడే తనకి 23 ఏండ్లు నిండాయి. ఆ కథలోలా తనూ వృద్ధ బ్రహ్మచారిణి అయిపోతే! తన పెళ్ళి విషయమై తన వాళ్ళెవరూ ఇంక కలగజేసికోరు. తనకి పెళ్ళికాకుండా అల్లాగే ఉండిపోతే! ఆలోచన వచ్చేప్పటికి ముచ్చెమటలు పోశాయి. లేచి లైట్ వేసి కిటికీలో ఉన్న మరచెంబులోంచి ఓ గ్లాసుడు నీళ్లు తాగి, వెనక్కు తిరిగింది. బదరీ అప్పుడప్పుడన్న మాటలు జ్ఞాపకం వస్తున్నాయి. మన ఆడపిల్లలు ఉన్న అందం కాస్తాగూడా కనిపించకుండా అసహజంగా ప్రవరిస్తారని అన్నాడు ఓసారి. తను కాస్త పొడగరి. తన అక్కయ్య మూలాన్ని ఒంగి నడవడం అలవాటైంది. స్కూల్‌కి అక్కయ్యా తనూ కలిసివెళ్ళేవారు. అక్కయ్య కంటె తను పొడుగు. తను మామూలుగా నిటార్గా నడుస్తుంటే, పక్కనుంచి అక్కయ్య ఓ పోటు పొడుస్తుండేది, 'కాస్త వంగి నడూ, మొగపిల్లలు ఉన్న స్కూల్లో చదువుతున్నావ్, ఒళ్ళుదగ్గర పెట్టుకుని ఉండు'

అని తన బాడీగార్డులా ప్రవర్తించేది వదుపుకున్నన్నాళ్ళూ అప్పటినుంచి అల్లా కొంచెం వంగి నడవడమే అలవాటైంది ఓసారి బదరీ అన్నాడు 'కొందరు ఆడ వాళ్ళ వీపు మాత్రం ప్రత్యేకంగా కనిపించేట్టు ఒంగి నడుస్తారు ఒంటెల్లా ఆ వీపు ఏదో ప్రత్యేక అందాన్ని ప్రదర్శిస్తున్నట్టు, తను ఎందుకో 'నోరుముయ్యి' అనవసర ప్రస్తావన చెయ్యకు' అనలేక పోయింది అతని ఆ మాటలు జ్ఞాపకానికి రాగానే నిటారుగ్గా నడవటం ఆరంభించింది గదిలో అటునుంచి ఇటు దృష్టి ఎదురుగా ఉన్న టేబిల్ మీదకు పోయింది బదరీ బొత్తిగాపెట్టిన పేక అల్లాగే ఉంది ఒక్కొక్క అడుగే వేసుకుంటూ టేబిల్ దగ్గర కుర్చీలో కూచుంది పేక చేతిలోకి తీసుకుని యాదాలాపంగా ఒక్కొక్క ముక్కే తిరగెయ్యడం మొదలు పెట్టింది. తన జీవితంలో గడచిపోయిన అర్థంలేని రోజులలా పేకముక్కలు ఒకదానివెంట ఒకటి తిరగబడుతున్నాయి ఇస్పేట్ ఆరు,' అరకు పది, కళావరు తొమ్మిది ఇల్లా ఎన్నో వచ్చాయి తర్వాత వచ్చిపడింది ఇస్పేటు జాకీ పిడుగులాగ. ఉలిక్కిపడి లేచింది నీరద తొందరగా మిగతా ముక్కల్లో ఇస్పేట్ జాకీ కలిపేసి బొత్తుగా పెట్టి, లేచి కిటికీ దగ్గరకు వెళ్ళి మరోగ్లాసు మంచినీళ్లు తాగింది. కిటికీ ఊచలకి నుదురు ఆనించి బయటకు చూస్తో నిలబడింది. కిటికీ ఊచలు నుదుటికి చల్లగా తగులు

తున్నా, ఆలోచనల వేడి మాత్రం తగ్గలేదు. ఇస్పేటు జాకీ తిరగబడింది. తనకి డైమండ్ జాకీ రావాలని ఉంది. దామోదర్ ఎంత బాగా మాట్లాడతాడు! ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూంటాడు క్రితం తన పుట్టినరోజుకి ఎంత మంచి బహుమతి ఇచ్చాడు! లాటరీలో డైమండ్ జాకీయే వచ్చిందని బదరీతో చెప్పి దామోదర్ నే పెళ్ళి చేసేసుకుంటే? ఇంతకీ బదరీకి నచ్చజెప్పడం దేనికి? తన మనస్సుకి తనే సమాధానం చెప్పుకోవాలి పెళ్ళి లాటరీ లాంటి దన్నాడు బదరీ. తీరా దామోదర్ ని చేసుకున్న తర్వాత, శ్యామసుందర్ నే చేసుకోలేదని విచారించవలసి వస్తుందేమో! శ్యామసుందర్ నిండయిన మనిషి కళ్ళల్లో శాంతం తొణికిసలాడుతూంటుంది ఏదో పెద్దమనిషి తరహా ఉంది మనిషి దగ్గర. ఏమో ఈ ఆలోచనలకి బుర్ర వేడెక్కి పోతోంది ఇవేళ ఏదో నిశ్చయానికివస్తే తప్ప తనకి మనశ్శాంతి లేదనుకుంది. తిరిగి టేబుల్ దగ్గరకు వెళ్ళి నిశ్చయంతో కూచుంది పేక తీసి బాగా ఐదారుసార్లు కలిపింది. ఒక్కొక్క ముక్కే తాపీగా తిరగవేయడం మొదలెట్టింది ఒక్కొక్క ముక్కే తిరగబడుతోంది. అంతవరకు తొమ్మిది ముక్కలు తిరగబడ్డాయి. 10 వ ముక్క తిరగబడింది అది ఇస్పేట్ జాకీయే. ఈ మాటు నీరద త్రుళ్ళిపడ లేదు ఇస్పేట్ జాకీ ఎంతో అందంగా కనిపించింది ఈసారి. తన మనస్సులో

ఇంక అనుమానాలు లేవు. తన భవిష్యత్ నిర్ధారణ అయిపోయింది. ఇంతకాలం మనస్సును పట్టిన మబ్బు ఏదో తొలగిపోయింది. ఎదురుగా ఉన్న ఇస్పేట్ జాకీకి సలాం చేసింది, నిటాగ్గా నుంచుని పేకలన్నీ జాగ్రత్తగా బొత్తుపెట్టి డ్రాయరు సొరుగులో పెట్టింది. ఆ రాత్రి ఎన్నడూ ఎరగనంత సుఖంగా నిద్రపోయింది.

తర్వాత వారం రోజుల్లో నీరద, శ్యామసుందరుల పెళ్ళి అయిపోయింది. పెళ్ళి అయిన రెండేళ్ళ తర్వాత ఓ నాడు సాయంకాలం, నీరద మేడమీద గదిలో సోఫాలో పిల్లవాణ్ణి ఒళ్ళో వేసుకుని కూర్చుని ఉంది ఎదురుగా ఇదివరకు తనతో పనిజేసిన స్నేహితురాలు కనకం కూర్చుని ఉంది. విశాలమైన కిటికీలలోంచి బయట కొండలు మసకమసకగా కనిపిస్తున్నాయి. వంటమనిషి ట్రేలో రెండు కప్పులు కాఫీ తెచ్చి టీపాయ్ మీద పెట్టి వెళ్ళిపోయింది కాఫీ త్రాగుతూ "అదృష్టవంతురాలివే నీరదా! మంచి భర్తా, పని చెయ్యడానికి నౌకర్లు, ఊరికి దూరంగా విశ్రాంతిగా ఈ ఇల్లూ, నాకు నిజంగా అసూయగా ఉందే నిన్నుచూస్తే" అంది కనకం నీరద తృప్తితో చిరునవ్వు నవ్వింది

"పాత స్నేహితుల్లో బదరీ ఎప్పుడేనా వస్తుంటాడా?" అడిగింది కనకం

నీరద ముఖంలో నవ్వు మాయమయింది. "లేదు. ఎప్పుడూ రాడు" అంది.

"ఎందుకని?" అని ఆశ్చర్యంగా అడిగింది కనకం.

"ఓ సారి ఇల్లాగే కాఫీ తాగుతుంటే వచ్చాడు. అల్లాగే సగం తాగిన కప్పు అతని మీదకు విసిరేశాను."

కాఫీ తాగుతున్న కనకానికి పలకమారి కాఫీ చీర మీద ఒలికింది. నీరద కేసి అర్థం కానట్టు చూసింది.

"అవును, నిజంగానే విసిరేశాను. విషయం అంతా చెబుతేగాని నీకు తెలియదులే మా పెళ్ళి అవడం గుర్తుందికదా. పెళ్ళి అయిన వెంటనే, మేము అజంతా, ఎల్లోరా, అక్కడనుంచి బొంబాయి, ఢిల్లీ అన్నీ తిరిగి రెండు నెలల తర్వాత తిరిగివచ్చాం. ఇంకా కాలేజీవాళ్ళిచ్చిన క్వార్టర్స్‌లోకి మారలేదు ఆ మర్నాడు మధ్యాహ్నం కాలక్షేపంకోసం "క్లిరన్స్" ఆడదాం రమ్మన్నాడు శ్యామసుందర్. నా డ్రాయర్ సొరుగులోంచి పేక తీసి కలిపి ఓ ఆట వేశాడు ఆట కొంతసేపు అయేసరికి "ఇదేమిటి నీరదా, ఇందులో నాలుగు జాకీలూ ఇస్పేట్ జాకీలే ఉన్నాయేమిటి! పొరపాటున మిగతా పేకల్లోవి కలిసిపోయాయేమో" అంటూ సొరుగులో ఆ ప్రక్కగా ఉన్న మిగతా పేకలోంచి మిగతా జాకీలు తీశాడు ఓ క్షణం నా ముఖం నల్లబడిపోయింది. నాలో మార్పు అతను కనిపెట్టలేదనుకో. నా కప్పుడు ఈ మోసం అర్థమయింది."

"ఏమో నాకంతా అగమ్యంగా ఉంది."



"పూర్తిగా విను మరీ! ఆ వేళ నాకు పర్మనెంట్ అయిననాడు, మనం స్నేహితుల్ని పార్టీకి పిలిచాం జ్ఞాపకం ఉందా? దామోదర్, కామేశ్వరరావ్, ఆనందరావ్, శ్యామసుందర్, మా అన్నయ్య ఇంకా ఎవరెవరో కలిసి ఫలహారాలు అయాక నాలుగు పేకలూ కలిపి అడ్డాట వేశారు నీకు ట్రెయిన్‌కి టైం అయిపోతోందని నువ్వు వెళ్ళి పోయావు 7 గంటలకి. తర్వాత ఓ అరగంటకి మా అన్నయ్యకూడా లేచాడు తనకి బస్‌కి టైమ్ అవుతోందని ఆట ఆపుజేసి అంతా లేచారు వాళ్ళు వెళ్ళిన కాసేపటికి బదరీ వచ్చాడు ఆలస్యంగా రావడానికి ఏదో కారణం చెప్పాడు బల్ల మీద ఉన్న నాలుగు పేకల్లోంచి ఓ పేక విడదీసి ఒక్కడూ "పేషన్స్" ఆడుతూ, సంభాషణ నా పెళ్ళి విషయంలోకి దింపాడు. నాకు వయస్సు దాటిపోతోందనీ, ఒక వయస్సు దాటిన తర్వాత స్త్రీకి పెళ్ళయే అవకాశాలు తగ్గిపోతాయనీ-అవీ ఇవీ చెప్పి, నేను తొందరగా పెళ్ళిచేసుకోడం అవసరం అనే భావం నా బుర్రలో ఎక్కిం చాడు చివరకు వెళ్ళేప్పుడు 'ఉన్న నలుగురిలోనూ, ఎవరో అని తేల్చుకోలేక పోవచ్చు ఈ పేకలో నాలుగు జాకీలూ మీ నలుగురు స్నేహితులు అనుకోండి. ఈ పేకకే ప్రశ్న వెయ్యండి పేక కలిపి కళ్ళు మూసుకుని ఒక్కొక్క ముక్క తిరగెయ్యండి. మొదట ఏ జాకీవస్తే, మీ ప్రశ్నకి అదే సమాధానం అనుకోండి' అంటూ యాదాలాపంగా చెప్పినట్టు చెప్పి వెళ్ళిపోయాడు. అతను వెళ్ళాక, పెళ్ళి

ఆలోచనలతో వేడెక్కిపోయిన నా బుర్రకి, అతను చెప్పినది నిజమే అనిపించింది ఎవరో ఒకర్ని తేల్చుకుని పెళ్ళి చేసుకోవాలను కున్నాను ''

''ఇంతవరకు మోసం ఎక్కడుందో తెలియటంలేదు'' అంది కనకం.

''ఇదిగో విను నాలుగు జాకీలకీ నలుగురి పేర్లూ పెట్టాడు డైమండ్ జాకీ దామోదర్ అనీ, అరకుజాకీ ఆనందరావనీ, కళావర్ జాకీ కామేశ్వరరావనీ స్పేట్ జాకీ శ్యామసుందర్ అనీ అనుకోమన్నాడు. బదరీకి నేను శ్యామసుందర్‌నే పెళ్ళి చేసుకోవాలని ఉండేది. అందుకని ఏం చేశాడో తెలుసా? నాతో మాట్లాడుతూనే తను పేషన్స్ ఆడుతున్నట్టు ఆడుతూనే, ఈ పేక లోంచి మిగతా మూడు జాకీలు తీసేసి, మిగతా పేకల్లోంచి 3 ఇస్పేట్ జాకీలు తీసి ఈ పేకలో కలిపేసి వెళ్ళిపోయాడు. ఏదీ నిశ్చయించుకోలేక బుర్ర వేడెక్కి ఉన్న నేను, సరిగ్గా బదరీ ఎల్లా అనుకున్నాడో అల్లాగే చేశాను. రెండుసార్లు ముక్కలు తిరగేసినా ఇస్పేట్ జాకీయే వచ్చింది అందులో ఇంకో జాకీ ఉంటేగా! నా ప్రశ్నకు భగవంతుడి దగ్గరనుంచి వచ్చిన సమాధానం అనుకున్నాను ఆ క్షణంలో.''

''సరేగాని ఏం జరిగినా నీ మంచికే జరిగిందిగా, మరి కాఫీకప్పు ఎందుకు విసిరేశావే అతని మీద?'' అంది కనకం బలవంతాన నవ్వు ఆపుకుంటూ.

''ఇదుగో నవ్వేవంటేనా, చూడు!'' అంది కోపం తెచ్చుకుంటూ నీరద.

''నవ్వనులే,చెప్పు తరవాత విషయం ''

నీరద ఒళ్ళో కుర్రవాణ్ణి చూస్తూ, ''నిజంగా నా అదృష్టంకొద్దీ శ్యామసుందర్ నా భర్త అయాడనుకో నాకు అసలు కోపం ఎందుకు వచ్చిందంటే, మేము హనీమూన్ నుంచి తిరిగివచ్చిన తర్వాత ఓ నాడు ప్రొద్దున్నే బదరీ వచ్చాడు మా ఆయన ఇంటి ముందర గార్డెన్‌లో పని చేసుకుంటూ, 'ఇప్పుడే వస్తున్నా, లోపల నీరద ఉంది వెళ్ళు' అంటూ లోపలికి పంపించారు నేను అప్పుడే కాఫీ తాగుతున్నాను బదరీ వస్తూనే దొంగనవ్వు నవ్వి, వంగి వంగి సలాం పెడుతూ 'జాకీ సలాం' అన్నాడు నాకు ఒళ్ళు మండి పోయి, తాగుతున్న కాఫీ కప్పు అల్లాగే విసిరేశాను. 'ఆ చప్పుడేమిటి' అంటూ వెనకాలే మా ఆయన లోపలికి వచ్చారు ''

'' 'అబ్బే, మీ ఆవిడ కాఫీ ఇస్తే చెయ్యి జారి, కప్పు క్రిందపడి పోయింది తాగలేని పిల్లి బోర్ల పోసుకుందట' అన్నాడు బదరీ. క్రిందపడిన గాజు ముక్కల్ని జాగ్రత్తగా ఏరుతూ ''

కనకం విరగబడి పొట్ట చేత్తో పట్టుకుని పగలబడి నవ్వుతూ సోఫాలోంచి లేచింది. ''ఇదిగో నవ్వావంటే నా చేతిలో కాఫీ కప్పు ఉంది తెలుసా'' అంది నీరద ఆమె మాటలు లక్ష్య పెట్టకుండా, కనకం ఇల్లు అదిరిపోయేట్టు, నవ్వడం ఆరంభించింది కొంచెం సేపటికి నీరద కూడా నవ్వడం ఆరంభించింది ఈ హడావిడికి ఒళ్ళో పడుకున్న వంటివాడు కూడా లేచి, వాడూ నవ్వడం ఆరంభించాడు.

———